www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 17 మే 2023

5

ఏలూరు

ఎండ తీవ్రతకు ఉపాధి కూలీకి అస్వస్థత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఎండ వేడిమి ధాటికి ఉపాధి హామీ కూలీ అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం మండలంలోని వంకవారిగూడెంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వంకవారిగూడెం గ్రామంలో కొన్ని రోజులుగా గ్రామస్తులు ఉపాధి హామీ పనులకు వెళ్తుండగా మంగళవారం వీచిన వడగాలులకు మడకం కన్నమ్మ (40) పని ప్రదేశంలో అకస్మాత్తుగా కళ్లు తిరిగి కింది పడిపోయింది. దీంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఆమెను జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించి చికిత్స అందించారు. ఎండ తీవ్రత వల్ల కన్నమ్మ అస్వస్థతకు గురైందని, చికిత్స అనంతరం కొద్దిసేపటికి ఆమె కోలుకుందని, ఇంటికి పంపించామని వైద్యురాలు సుష్మ తెలిపారు.

కౌలు కార్డులపై శ్రద్ధేదీ..!

కౌలురైతుల పట్ల ప్రభుత్వం మరోసారి నిర్లక్ష్య ధోరణి కనబరుస్తోంది. రెండు జిల్లాల్లోనూ 2023-24కు సంబంధించి కౌలుకార్డుల (సిసిఆర్‌సి) జారీ ప్రక్రియ నేటికీ మొదలు కాని పరిస్థితి నెలకొంది. ప్రతియేటా కౌలురైతులకు అన్యాయం చేస్తూ భూయజమానులకు కొమ్ముకాస్తున్న పాలకులు ఈసారీ అదేబాటలో నడుస్తున్నట్లు కన్పిస్తోంది. అరకొరగా కౌలుకార్డులు జారీ చేసి మమ అన్పించేలా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కౌలురైతులకు మరోసారి తీవ్ర అన్యాయం జరగనుందనడంలో ఎటువంటి సందేహమూ అక్కర్లేదు.



- రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు
- నేటికీ ప్రారంభం కాని సిసిఆర్‌సి జారీ ప్రక్రియ
- ఖరీఫ్ సాగుపై దాదాపు పూర్తయిన రైతుల మధ్య ఒప్పందాలు
- గతేడాది అరకొర కార్డుల జారీతో కౌలురైతులకు తీరని నష్టం
- భూయజమాని అంగీకారం నిబంధనతో దారుణ పరిస్థితి
- పంట నష్టం, బీమా, బ్యాంకు రుణం ఏఒక్కటీ అందని ద్రాక్షే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మే నెల సగం రోజులు గడిచిపోయినా కౌలురైతులకు అందించే పంట సాగుదారుని హక్కుపత్రాలు (సిసిఆర్‌సి) జారీ ప్రక్రియపై రెండు జిల్లాల అధికారుల్లోనూ చలనం లేకుండాపోయింది. ఇప్పటికే మూడొంతుల మంది రైతులు ఖరీఫ్ సాగుకు సంబంధించి పంట ఒప్పందాలు పూర్తి చేసుకున్న పరిస్థితి నెలకొంది. దీంతో ఈ ఏడాది సైతం కౌలురైతులకు తీవ్ర అన్యాయం చేసేందుకు ప్రభుత్వం పూనుకుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. రైతుభరోసా కేంద్రాలు, సచివాలయ వ్యవస్థ ద్వారా కౌలురైతులను గుర్తించి కౌలుకార్డులు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు. ప్రతియేటా గ్రామసభలు పెట్టి కౌలురైతులను గుర్తించి కార్డులు జారీచేసే విధంగా ప్రక్రియ ప్రారంభించేవారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఆ ప్రక్రియ సైతం మొదలుకాలేదు.

వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలురైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. 2011 భూఅధీకృత చట్టంలో భూయజమానితో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు సిసిఆర్‌సి కార్డులు జారీ చేయాలని నిబంధన ఉండేది. దీంతో రైతుసంఘాలు, రైతులు రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేసి తమ హక్కుగా ఉన్న కౌలుకార్డులు పొందేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక 2011లోని కౌలురైతుల చట్టానికి మార్పులు చేసి 2019 పంటసాగుదారు హక్కు చట్టం తెచ్చింది. ఈ చట్టంలో భూయజమాని రాతపూర్వకంగా అంగీకరిస్తేనే కౌలురైతులకు కార్డులు జారీ చేయాలనే నిబంధన విధించింది. ఇది కౌలురైతులకు పెనుశాపంగా మారింది. 90 శాతం మంది భూయజమానులు కౌలురైతులకు కార్డులు జారీ చేసేందుకు ఒప్పుకోవడం లేదు. భూయజమానులకు అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమైన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రతియేటా కౌలుకార్డులు జారీ ప్రక్రియ తూతూమంత్రంగా తయారైంది. ఏదో కొద్దిమందికి సిసిఆర్‌సి కార్డులు చేసి మమ అన్పిస్తున్నారు. దీంతో ధాన్యం విక్రయించడానికి కూడా కౌలురైతులకు వీల్లేకుండాపోయింది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టపరిహారం, బీమా వంటివి సైతం కౌలురైతులకు అందడం లేదు. సాగు చేయని భూయజమాని ఖాతాల్లోకి వెళ్లిపోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు.

మళ్లీ కౌలురైతులకు అన్యాయమేనా?

గతేడాది కౌలుకార్డుల జారీ ప్రక్రియ మమ అన్నట్లు సాగించి కౌలురైతులకు అన్యాయం చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి రెండు జిల్లాల్లో కలిపి దాదాపు లక్షా 30 వేలు వరకూ మాత్రమే సిసిఆర్‌సి కార్డులు జారీ చేసిన పరిస్థితి కన్పించింది. దీనిలో బ్యాంకు రుణాలు పొందిన రైతులు సగం మంది కూడా లేరు. ప్రభుత్వం అందించే రైతుభరోసా సాయం అందుకున్న కౌలురైతులను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. ఈ ఏడాది కౌలురైతులకు అన్యాయం జరిగే పరిస్థితి కన్పిస్తోంది. గ్రామసభలు పెట్టి కౌలురైతులను గుర్తించి భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా కౌలుకార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదని స్పష్టంగా కన్పిస్తోంది. ఇప్పటికైనా కౌలురైతులకు సిసిఆర్‌సి కార్డులు మంజూరును సచివాలయ వ్యవస్థ ద్వారా పెద్దఎత్తున చేపడితేనే వాస్తవ సాగుదారులకు న్యాయం జరుగుతోంది.

భూయజమాని అంగీకారంతో నిమిత్తం లేకుండా సిసిఆర్‌సి కార్డులు అందించాలి

కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

భూయజమాని అంగీకారంతో నిమిత్తం లేకుండా గ్రామస్థాయిలో విఆర్‌ఒ, సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా కౌలురైతులను గుర్తించి సిసిఆర్‌సి కార్డులు జారీ చేయాలి. కౌలుకార్డు లేకపోవడం వల్ల రైతులకు పంట రుణాలు, పంట నష్టపరిహారం, బీమా ఏఒక్కటీ అందడం లేదు. దీంతో జిల్లాలో కౌలురైతుల ఆత్మహత్యల సంఖ్య ఆందోళనకరంగా మారుతోంది. కౌలుకార్డుల జారీ ప్రక్రియ సరిగ్గా అమలు చేయకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతాం.

మాట్లాడుతున్న మంతెన సీతారాం

బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రజలపై పెనుభారాలు మోపుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. మంగళవారం పట్టణంలో స్థానిక ఏలూరు రోడ్డులోని రోటరీ కమ్యూనిటీ హాల్లో సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథులైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, బి.తులసీదాస్, జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన కర్నాటక ఎన్నికల్లో బిజెపికి డిపాజిట్లు కూడా గల్లంతయ్యాయన్నారు. దేశాన్ని ఖూనీ చేయాలని చూస్తే ప్రజలు ఇదే తీర్పు ఇస్తారని హెచ్చరించారు. ఇదే స్ఫూర్తితో దేశ రాజకీయాల్లో వామపక్షాలు మన రాజ్యాంగాన్ని కాపాడటం కోసం కలిసొచ్చే పార్టీలను కూడగట్టి రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని కోరారు. ఇప్పటికే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, తడిచిన ధాన్యం, మొక్కజొన్న ప్రభుత్వాలు కొనుగోలు చేయక రైతులు రోడ్డున పడుతున్నారని వాపోయారు. తక్షణమే ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసి మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే వేతన బకాయిలు విడుదల చేయాలని కోరారు. పని ప్రదేశాల్లో చలువ పందిళ్లు, మజ్జిగ తాగునీరు లేక వడదెబ్బతో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలు మృతి చెందుతున్నారని వాపోయారు. కనీస వసతులు కల్పించాల్సిన ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వడదెబ్బతో మృతి చెందిన కూలీలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను ఉపాధి కూలీలను ఐక్యం చేసి సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్లు ముట్టడిస్తామని అధికారులను హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాదు, టి.రామకృష్ణ, టి.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు, మండల నేతలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా రెండోరోజు ఎపి ఇఎపి సెట్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎపిఇఎపి సెట్ పరీక్ష రెండో రోజైన మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఏలూరులోని మూడు కేంద్రాల్లో అంటే వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలల్లో రెండు షిఫ్ట్‌లలో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 921 మందికి 894 మంది హాజరవ్వగా 27 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన మొదటి షిఫ్ట్‌లో సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో 180 మందికి 175 మంది హాజరవ్వగా ఐదుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 131 మందికి 129 మంది హాజరవ్వగా ఇద్దరు గైర్హాజరయ్యారు. అలాగే సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 147 మంది హాజరవ్వగా ముగ్గురు గైర్హాజరయ్యారు. మొత్తం ఉదయం షిఫ్ట్‌లో 461 మందికి 451 మంది హాజరవ్వగా పది మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు జరిగిన రెండో షిఫ్ట్‌లో సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 173 మంది హాజరవ్వగా ఏడుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 130 మందికి 128 మంది హాజరవ్వగా ఇద్దరు గైర్హాజరయ్యారు. సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 142 మంది హాజరవ్వగా ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. మొత్తం రెండో షిఫ్ట్‌లో 460 మందికి 443 మంది హాజరవ్వగా 17 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు.

రెజ్లర్లకు మద్దతుగా ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ధర్నాలో నినదిస్తున్న నేతలు

లైంగిక వేధింపులకు నిరసనగా మహిళా రెజ్లర్లు ఢిల్లీలో సాగిస్తున్న ఆందోళనకు సంఘీభావంగా మంగళవారం ఏలూరులో ఐఎఫ్‌టియు, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను తక్షణం అరెస్టు చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని, మోడీ-షా మహిళా వ్యతిరేక విధానాలు నశించాలని, పని స్థలాల్లో మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్ నుండి ర్యాలీగా బయలుదేరి జెడ్‌పి మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని మాట్లాడారు. ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇఫ్టూ నగర అధ్యక్షులు కాకర్ల అప్పారావు, ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, నాయకులు మంగం అప్పారావు, డి.వీరినాయుడు, బి.వీరభద్రం పాల్గొన్నారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి అనుకూల పరిస్థితులు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మంజూరైన యూనిట్లు త్వరితగతిన గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో మంగళవారం మత్స్యశాఖ జిల్లాస్థాయి కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని, వాటి ద్వారా ఆయా ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా వివిధ యూనిట్లకు దరఖాస్తు చేసుకున్నారని, వాటికి బ్యాంకుల నుండి త్వరితగతిన రుణ సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుని, లబ్ధిదారులచే యూనిట్ల స్థాపనకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మినీ ఫిష్ కియోస్కులు, ఫిష్ రిటైల్ మార్కెట్ హబ్‌లు, లైవ్ ఫిష్ వెండింగ్ కేంద్రాలు, ఆక్వా ఉత్పత్తులు అమ్మేందుకు అవసరమైన ఐస్ బాక్స్ కలిగిన మోటార్ సైకిళ్లు, ఇన్సులేటెడ్ వాహనాలు, ఆక్వా ల్యాబ్‌లు తదితర పథకాల కింద 2020-21 నుండి 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు 426 మంది నిరుద్యోగ యువతకు వివిధ పథకాలను మంజూరు చేశారని తెలిపారు. వాటిలో ఇంకా 236 యూనిట్ల గ్రౌండింగ్ పనులు పెండింగ్లో ఉన్నాయన్నారు. సదరు యూనిట్లు వెంటనే గ్రౌండింగ్ అయ్యేలా మత్స్య శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పెద్దఎత్తున నిర్మిస్తున్న జగనన్న లేఅవుట్ల వద్ద మినీ ఫిష్ కియోస్కులు ఏర్పాటు చేసేందుకు అనువైన పరిస్థితులు పరిశీలించి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆక్వా ఫీడ్ యూనిట్ల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులు పరిశీలించి, వాటి ఏర్పాటుకు అవసరమైన అనుమతులు పరిశీలించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఐటిడిఎ ఇన్‌ఛార్జి ప్రాజెక్ట్ అధికారి సత్యనారాయణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, ఎల్‌డిఎం వెంకటేశ్వరరావు, కృషివిజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ ఎ.దేవరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి రవాణా అరికట్టేందుకు స్పెషల్ టీమ్‌లు

ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మాట్లాడుతున్న అశోక్‌కుమార్

గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఆయన మీడియాతో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు నాలుగేళ్ల కిందట ముద్దాయిల వివరాలను కూడా సేకరిస్తున్నామని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో పోక్సో కేసులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని, దిశ స్టేషన్లో కూడా 12 కేసులు ఉన్నాయని తెలిపారు. రాబోయే ఆరు నెలల్లో ఈ పన్నెండు కేసుల్లో సీరియస్ కేసుల్లోని ముద్దాయిలకు త్వరితగతిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మండల స్థాయి అధికారులతో, అక్కడున్న యువతతో పీస్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల ఏలూరు రేంజ్‌కు బదిలీపై వచ్చిన డిఐజి అశోక్ కుమార్ తొలిసారిగా భీమవరంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించి క్రైమ్ రేట్ తగ్గేందుకు చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. డిఐజి వెంట జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, డిఎస్‌పి బి.శ్రీనాథ్, సిఐలు, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న పాతపాటి శ్రీనివాసరాజు

క్షత్రియులకు అన్నివిధాలా సేవలందిస్తా

రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు

కాళ్ల: సిఎం జగన్ నమ్మకాన్ని వమ్ము చేయనని, క్షత్రియులకు అన్ని విధాలా సేవలందిస్తానని రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి ఆయన పుష్పగుచ్ఛం అందించామని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డితో తాను పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. క్షత్రియ సామాజిక వర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నాని తెలిపారు. తన తండ్రి సర్రాజు అడుగు జాడల్లో, సిఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు.

రోటరీ ఆధ్వర్యాన చిన్నారులకు పోటీలు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 20వ తేదీ నుండి స్థానిక రోటరీ నిర్వహణలో చిన్నారులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని రోటరీ అధ్యక్షులు దాకారపు కృష్ణ తెలిపారు. మంగళవారం దాకారపు కృష్ణ తన కార్యాలయంలో పోటీల వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు వేసవి సెలవుల్లో వినోదం, విజ్ఞానం క్రీడాస్ఫూర్తిని పెంపొందించే క్రమంలో ఈ నెల 20వ తేదీ నుండి బాలబాలికలకు ఆరు రకాల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 7 నుండి 15 సంవత్సరాల వయస్సున్న చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చున్నారు.

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీకి ప్రత్యేక ఏర్పాట్లు

అధికారుల సమీక్షలో డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న డిఆర్‌ఒ మూర్తి

జిల్లాలో ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి అధికారులను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డిఆర్‌ఒ అధ్యక్షతన ఇంటర్ పబ్లిక్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి మాట్లాడుతూ ఈ నెల 24 నుండి జూన్ ఒకటో తేదీ వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలను జరగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లాలో 11,223 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, ఈ పరీక్షల నిమిత్తం ఏలూరు జిల్లాలో 32 సెంటర్లను ఏర్పాటు చేశారని తెలిపారు. జూన్ రెండో తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎథెక్సెన్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షలు, జూన్ 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ పరీక్ష, జూన్ ఐదో తేదీ నుంచి జూన్ తొమ్మిదో తేదీ వరకు ప్రాక్టికల్ (జనరల్ ఒకేషనల్) పరీక్షలు జరగనున్నాయని చెప్పారు. పరీక్షా పత్రాలను స్ట్రోరేజీ పాయింట్ నుంచి పరీక్షా కేంద్రాలకు తరలింపు, పరీక్ష పూర్తయిన అనంతరం సమాధాన పత్రాలను తిరిగి తపాలా కార్యాలయాలకు చేర్చే ప్రతి దశలోనూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బందోబస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలు, 144 సెక్షన్ విధింపు, సీసీ కెమెరాల నిఘాలో పోలీస్‌శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు, ఫొటో స్కానింగ్ కేంద్రాలను పరీక్షా సమయాల్లో మూసివేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఆర్‌టిసి బస్సులను నడపాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాల ఏర్పాటుతోపాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎవ్వరూ సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాలకు తెచ్చేందుకు అనుమతి లేదన్నారు. ఇన్విజిలేటర్ల సెల్‌ఫోన్లను కూడా అనుమతించబడవని స్పష్టం చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ముందే చేరుకోవాలని, కోవిడ్ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్, డిఇసి కన్వీనర్ కె.చంద్రశేఖరరావు, ఎఎస్‌పి సూర్యచంద్ర, ఆర్‌టిసి పిఆర్‌ఒ నరసింహం, విద్యుత్, వైద్యం, మున్సిపల్ కార్పొరేషన్, పోస్టల్, డిపిఒ, విద్యా శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు తువ్వాలు కప్పుకుని వెళ్తున్న మహిళ

ముదినేపల్లిలో ఎండ మంట

జనం ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజలు మండే ఎండలతో విలవిలాడిపోతున్నారు. పది రోజులుగా మండలంలో ఎండలు తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీంతో ఇంటి నుంచి కాలు బయటపెట్టాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఎండలు మండిపోవడంతోపాటు వడగాల్పులు కూడా వీయడంతో వృద్ధులు, పిల్లలు తల్లడిల్లుతున్నారు. సాధారణంగా మే మూడో వారంలో రోహిణి కార్తె సందర్భంగా ఎండలు మండిపోవడం సర్వసాధారణం. అయితే రోహిణి కార్తెకు ముందే అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సిన వారు టోపీలు, తువ్వాళ్లు ఉపయోగిస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ఇళ్లలోని గోడలు, వస్తువులు సైతం వేడెక్కిపోతున్నాయి. దీంతో వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు పళ్లరసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ, చెరకు రసం వంటివి తీసుకుంటున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులతోపాటు రోగులు వేసవి తాపానికి అల్లాడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే హడలెత్తిపోతున్నారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకుండా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల్లోపు, సాయంత్రం ఐదు గంటల తర్వాత మాత్రమే ప్రజలు బయటకు రావాలంటున్నారు. ప్రస్తుతం నాన్‌వెజ్‌కు దూరంగా ఉండాలని, ఆకుకూరలు, కూరగాయలు మాత్రమే ఆహారంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లే వారు గొడుగులు, టోపీలు, ముఖానికి రుమాళ్లు ధరించి వెళ్లాలని చెబుతున్నారు.

తారెత్తిస్తున్న ఎండలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైనే నమోదవుతున్నాయి. ఎండ వేడిమి తాళలేక గ్రామంలో ప్రజలు నివాసాలకే పరిమితమవుతున్నారు. మెయిన్ బజార్లు, రోడ్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. దీనికి తోడు అనధికార విద్యుత్ కోతలు తరచూ జరగడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండ వేడిమి తాళలేక ఇబ్బందులకు గురవుతున్నామని, ఈ వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


డాక్టరేట్ అందుకుంటున్న రాజేంద్రకుమార్

రాజేంద్రకుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన పర్వతనేని రాజేంద్రకుమార్ అన్నామలై యూనివర్సిటీ పిహెచ్‌డి డాక్టరేట్ అవార్డు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అందుకున్నారు. ఆప్టిమైజేషన్ అసిస్టెడ్ ఎఐ బేస్డ్ మోడల్స్ ఫర్ హార్ట్ డిసీజ్ ప్రిడిక్షన్ అనే సాంకేతిక అంశంపై పరిశోధన చేసి ప్రచురించిన సిద్ధాంత గ్రంథం నిపుణల కమిటీ పరిశీలన తరువాత అధికారుల ఆమోదముద్ర పొందింది. తన పరిశోధనలో రూపొందించిన పలు పరిశోధన పత్రాలు వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఆయనకు అవార్డు రావటంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కూలింగ్ వాటర్‌ను ప్రారంభిస్తున్న గారపాటి రేణుక

తపన ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రజలకు ఉపయోగపడే ప్రతి కార్యక్రమానికి తపన ఫౌండేషన్ తన వంతు సహకారం అందిస్తుందని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. మంగళవారం ఆగిరిపల్లిలోని శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరశింహస్వామిని ఆయన సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిలకపాటి కాంప్లెక్స్ వద్ద తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్‌ను గారపాటి రేణుక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కె.బాబురావు, జిఆర్‌కె.రంగారావు, ఆర్.రామారావు, వేదపాఠశాల కార్యదర్శి సూరి శర్మ పాల్గొన్నారు.

సత్యానందం మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎస్ఐ

సత్యానందం మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పోలీస్‌శాఖకు అపారమైన సేవలందించిన మందా సత్యానందం మృతి బాధాకరమని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు అన్నారు. మండల పరిధిలోని పోతవరప్పాడు గ్రామానికి చెందిన మందా సత్యానందం 33 సంవత్సరాలుగా పోలీసుగా విశేష సేవలందించారు. ఉద్యోగ విరమణ చేసిన ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఎస్ఐ చంటిబాబు సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న సిఐ బాలసురేష్‌బాబు

వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్థానిక వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సిఐ బాల సురేష్‌బాబు అన్నారు. స్థానిక నాలుగో వార్డు ఇందిరానగర్ వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిఐ బాల సురేష్‌బాబు మంగళవారం ప్రారంభించారు. మజ్జిగతో పాటు గ్లోకొజ్, రస్నా అందించారు. అనంతరం సిఐ బాలసురేష్‌బాబు మాట్లాడుతూ వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు వలవల తాతాజీ చేపట్టే సేవాకార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మంచాల రవీంద్ర, తెలం గొర్ల సోమరాజు, మద్దిపాటి శ్రీను గుర్రం వీరబాబు, సాయి తియ్యల ప్రసన్న, శివ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

నూజివీడు రూరల్ : రోటరీ క్లబ్ ఆఫ్ మ్యాంగో టౌన్ నూజివీడు వారి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. నిత్యం 600 మందికి మజ్జిగ వితరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డైరెక్టర్ బోయపాటి ముఖర్జీ, మూల్పూరి లక్ష్మణస్వామి, ప్రెసిడెంట్ మలిశెట్టి శ్రీనివాస్, సెక్రటరీ రెడ్డి, సిహెచ్.వెంకటేశ్వరరావు, వెంకటరత్నం, అనిల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కూలింగ్ టిన్నులకు పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఎండలు తారెత్తిస్తున్నాయి. ఉష్ణతాపం ప్రజలకు తీరని దాహార్తిని పెంచుతోంది. చల్లని నీటి కోసం జనం మినరల్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. ఒకప్పుడు వేసవికాలంలో ప్రజలు మట్టి కుండలోని నీటిని తాగేవారు. కాలక్రమేణా ఫ్రిజ్ వినియోగం పెరిగింది. కుండలు పేదవాడి ఫ్రిజ్‌గా మారాయి. అర్థిక స్థోమత ఉన్నవారు నేడు కూలింగ్ టిన్నులను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. పట్టణం, పల్లెల్లో ప్రజలు తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. గ్రామాల్లో కుళాయిల ద్వారా నీరు సక్రమంగా రావడంలేదు. కొన్ని గ్రామాల్లో ఒకపూట మాత్రమే నీటిని కుళాయిలు ద్వారా అందిస్తున్నారు. నీటి కొరతతో ప్రతిఒక్కరూ కూలింగ్ టిన్నులను కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో చినషాపుల నుంచి హోటళ్ల వరకు, అలాగే చలివేంద్రాల్లోనూ కూలింగ్ టిన్నులనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. చాలాచోట్ల మట్టి కుండలు స్థానాన్ని కూలింగ్ టిన్నులు భర్తీ చేస్తున్నాయి. వేసవి నేపథ్యంలో అన్నసమారాధన వద్ద, ఏ శుభకార్యలైనా, బజారులో ఏ షాపులో చూసినా, హోటళ్లలో, తాపీ పనులు జరిగే చోట, చలివేంద్రాల్లో ఎక్కడ చూసిన కూలింగ్ టిన్నులు దర్శనమిస్తున్నాయి. వేసవి మూడు నెలలు కూలింగ్ టిన్నులు వినియోగించేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. టిన్నులో 12 గంటలు వరకు కూలింగ్ తగ్గకపోవడంతో ప్రజలు ఎక్కువగా వీటిని ఇష్టపడుతున్నారు. మండలంలో వాటర్‌ప్లాంట్ వద్ద 20 లీటర్ల చల్లటి నీరు రూ.40కి, డోర్ డెలివరి అయితే రూ.50కి నిర్వాహకులు అందిస్తున్నారు. మండల వ్యాప్తంగా సూమారు 25 వరకు వాటర్ ప్లాంట్స్ ఉన్నాయి.

వాటర్ ప్లాంట్ వద్ద కూలింగ్ టిన్నులు

ప్రాణాంతకమైన డెంగీని తరిమికొట్టాలి

ప్రజాశక్తి - కైకలూరు

దోమల నివారణతో అనేక వ్యాధులను నివారించవచ్చని ట్రెయినీ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎంపిపి అడివి వెంకటకృష్ణ మోహన్ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ అపూర్వ భరత్, ఎంపిపి కృష్ణమోహన్ మాట్లాడారు. ప్రజలు ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వైద్యులు హేమలత, శంకర్ మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. ఆసుపత్రి నుంచి ర్యాలీగా వెళ్లి మసీదు సెంటర్‌లో మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, తహశీల్దార్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కైకలూరులో...

ఆగిరిపల్లి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో దోమల వ్యాప్తిని నివారించటంతో పాటు డెంగీ వ్యాధిని నిర్మూలించవచ్చని ఆగిరిపల్లి ఎంపిడిఒ కె.వాణి అన్నారు. ఆగిరిపల్లి పిహెచ్‌సి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.ఉదయ భాస్కరరావు, వైద్యాధికారి జె.జగన్మోహనరావు, సిహెచ్ఒ లక్ష్మయ్య, పంచాయితీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని మండల వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ అత్యంత ప్రమాదకరమైందని తెలిపారు. డెంగీ వ్యాధి నివారణకు నివాసిత ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. దోమలు ఉధృతంగా ఉంటే దోమ తెరలు వాడాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్‌టి.స్వామి, మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్ వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : సమర్థవంతమైన సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారించగలమని చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి నెరుసు వెంకట రామారావు అన్నారు. కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రజల్లో డెంగీ వ్యాధి పట్ల అవగాహన పెంపొదించాలన్నారు. డెంగీ మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమన నిర్మూలన సాధ్యమన్నారు. నివాసిత ప్రాంతాల్లో దోమల నియంత్రణకు ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నెరుసు వెంకట రామారావు, పిహెచ్‌ఎన్. రమణమ్మ, హెచ్‌వి పరిమళ కుమారి, ఎంపిహెచ్ఎ మేల్, ఫీమేల్, ఎంఎల్‌హెచ్‌పి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ముసునూరు : డెంగీ అతి ప్రమాదకరమైన వ్యాధి అని ముసునూరు పిహెచ్‌సి వైద్యులు ఎం.కిరణ్‌కుమార్, రమణక్కపేట పిహెచ్‌సి వైద్యులు కరిముల్లా అన్నారు. మండలంలోని ముసునూరు, రమణక్కపేట గ్రామాల్లో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైద్యులు ఎం.కిరణ్ మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు.

జీలుగుమిల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు వైద్యాధికారిణి డాక్టర్ సుష్మ తెలిపారు. ఈ సందర్భంగా డెంగీ వ్యాధి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమ తెరలను వాడాలని తెలిపారు. అనంతరం జీలుగుమిల్లీ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గాయిత్రి, ఫార్మసిస్ట్ నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది నాగమణి నాగరత్నం, చంద్రకాంత్, ఆదిలక్ష్మి, ఎల్‌టి.విజయ్ పాల్గొన్నారు.

పోలవరం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పోలవరం ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు అన్నారు. మండలంలోని కుంకాల ఏజెన్సీ గ్రామంలో సర్పంచి కోటం గంగాదేవి, విస్తరణాధికారి నిఖిల్ మధు శరన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.నాగేశ్వరరావు ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజాఆరోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులని, దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధ వ్యాధి, మెదడు వాపు వ్యాధులు వస్తాయని వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. డెంగీ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న వైద్యశాలకు వెళ్లాలని, అశ్రద్ధ చేయకూడదని చెప్పారు. కుంకాల గ్రామంలో మొదటి విడతగా ప్రతి ఇంటికి దోమల నివారణకు దోమల మందు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎన్‌డి పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపిహెచ్ఇఒ జారేం ప్రసాద్, మలేరియా కార్యాలయ ఎంపిహెచ్ఒ పి.శ్రీనివాసరావు, ఎఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

టి.నరసాపురంలో..

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.శ్రీనివాస్‌గౌతమ్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శు భ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి పి.అనూష, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు 40 రోజుల పాటు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు కోరారు. మంగళవారం ఆయన భీమడోలు శాఖా గ్రంథాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం భీమడోలు శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమ ప్రగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న విద్యార్థులతో మమేకమయ్యా రు. వారు నేర్చుకుంటున్న, నేర్చుకోవాలనుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వారి సలహాలు, సూచనలు కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని 68 గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమాలకు 2500 మంది వరకు విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. ఈ సంఖ్యను మరింత పెంచేందుకు గ్రంథపాలకులు కృషి చేయాలని, ఉపాధ్యాయులు, ప్రముఖులు సహకారం తీసుకోవాలని సూచించారు. విద్యార్థులను విజ్ఞానవంతులుగా చేసేందుకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో నీతి కథల బోధన, పుస్తక సమీక్ష వంటి అంశాలకు తోడు యోగా శిక్షణ, చిత్రలేఖనంలో మెలకువలు నేర్పటం, పేపర్ క్రాఫ్ట్ తయారీ వంటి అంశాలను జతచేయాలని కోరారు. గతంలో భీమడోలు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన చదవటం మాకు ఇష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థ సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ బాలనాగ విజయ సారథి సేవలు అభినందనీయమన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొనే విద్యార్థుల కోసం వేలాది రూపాయల విలువైన ఇన్‌డోర్ క్రీడా సామగ్రి అందించిన విశ్రాంత ఉపాధ్యాయురాలు గుళ్ల నూకరాజును, యోగా ట్రైనర్‌గా వ్యవహరిస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారి భావనా రుషి, విద్యార్థులకు ప్రతినిత్యం స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇస్తున్న సత్యేంద్ర ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ పివివి.సత్యనారాయణతో పాటు ప్రతినిత్యం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్న సామాజిక కార్యకర్త మండే సుధాకర్లను ఆయన ప్రత్యేకంగా అభినందిం చారు. వారి సేవలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే క్రమంలో గుండుగొలను శాఖా గ్రంథ పాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో పాల్గొన్న ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యా యులు ఫణి కుమార్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సులువైన పద్ధతిలో కష్టమైన లెక్కలు చేయటం, చిత్రలేఖ నం, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి అంశాలను వివరించారు.

భీమడోలులో...

నిడమర్రు : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిడమర్రు శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ పాలకులు జి.బాలరాజు పర్యవేక్షించారు.

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లి గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు గొల్లపల్లి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు కె.మోహన్‌రావు పలు విషయాలపై అవగాహన కల్పించారు. పుస్తక పఠనం వల్ల అనేక లాభాలు ఉన్నాయని, విజ్ఞానం మరింత పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, గ్రంథాలయ అధికారి డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో సమస్యలపై నేడు సబ్‌కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని నూజివీడు సబ్ కలెక్టర్‌కు ఆయన కార్యాలయంలో ఈ నెల 17వ తేదీ బుధవారం వినతిపత్రం అందించనున్నట్లు సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు తెలిపారు. వినతిపత్రం అందించేందుకు మండలంలోని అన్ని గ్రామాలు ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన మండలంలోని గోపవరం, కాట్రేనిపాడు, వేల్పుచర్ల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల ప్రాంతం వద్ద మంగళవారం కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ విషయంలో కేంద్ర ప్రభుత్వం పనికిరాని నిబంధనలు పెట్టిందన్నారు. పని రోజులు తగ్గించడం, పని ప్రదేశంలో అలవెన్సులు ఇవ్వడంలో జాప్యం చేస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు చూస్తుందన్నారు. సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు మండలంలోని 16 గ్రామాల ఉపాధి హామీ కూలీలందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు పిల్లి మురళి ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ఆరోగ్య లక్ష్య సాధనకు గ్రామస్థాయి టాస్క్‌ఫోర్సు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అందరికీ ఆరోగ్యం అందించటానికి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో మూడో లక్ష్యం సాధించటానికి నియమించిన గ్రామ స్థాయి టాస్క్ ఫోర్స్ బృందం ప్రతి 15 రోజులకోసారి సమీక్షించాలని సచివాలయాల శాఖ జిల్లా నోడల్ అధికారి, డిఎల్‌డిఒ జి.రమణ ఆదేశించారు. ఆ శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం ఆధ్వర్యంలో మంగళవారం చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామ టాస్క్ ఫోర్స్ కమిటీలపై అవగాహన సమావేశం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ కెఎస్.వర్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా నోడల్ అధికారి రమణ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో 1-6 సాధన కోసం గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి టీం లీడర్‌గా ఐదుగురు సభ్యులతో ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైందని చెప్పారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ఎనిమిది ప్రాధాన్యత సూచికల ద్వారా లక్ష్యాలు సాధించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, యుక్తవయసు బాలల ఆరోగ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. యుక్త వయసు బాలికలకు క్రమం తప్పకుండా రక్త శాతం తెలుసుకునే పరీక్షలు జరపాలన్నారు. ఇవన్నీ సక్రమంగా జరపించటానికి గ్రామ స్థాయి టాస్క్ ఫోర్సు కమిటీ ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమానికి ఆ శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం కోఆర్డినేటర్ టిఎన్.స్నేహన్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెంబర్ 34 గురించి వివరించారు. అనంతరం జాతీయ డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీలో జిల్లా నోడల్ ఆఫీసర్, జిల్లా కోఆర్డినేటర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కెఎస్.వర్మ, పిహెచ్‌సి డాక్టర్ శ్రావణ్‌రెడ్డి, హెల్త్ ఎడ్యకేటర్ సుబ్బలక్ష్మి, హెల్త్ సూపర్ వైజర్లు గంగాధర్, నాగలక్ష్మి, పరమేశ్వరి, గ్రామ సామాజిక ఆరోగ్య అధికారులు తొమ్మిది మంది, ఎఎన్ఎంలు పది మంది, 26 మంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అవగాహనా ర్యాలీలో జి.రమణ, టిఎన్.స్నేహన్

20న గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - టి.నరసాపురం

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఈ నెల 20వ తేదీన రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ టి.నరసింహస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ఈ నెల 20వ తేదీన ఏలూరు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 5, 6, 7, 8 తరగతులకు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కళాశాలలకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లు https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ నుంచి తమ కాండిడేట్ ఐడి, పుట్టిన తేదీ ద్వారా వెబ్ సైట్ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. హాల్ టిక్కెట్లు పోస్టు ద్వారా పంపనున్నట్లు తెలిపారు.


పాడైపోయిన వీధిలైటు

వీధిలైట్ల పునరుద్ధరణకు చర్యలు : సర్పంచి

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామంలో ఈదురుగాలులకు చెట్టుకొమ్మ విరిగి 11 కెవి విద్యుత్ తీగలపై పడడంతో ఆ ప్రభావానికి వీధిలైట్లు పాడైపోయాయి. 150 వీధిలైట్లు ఈ విధంగా పాడైపోయాయని సర్పంచి మైగాపుల విజయదుర్గ తెలిపారు. కొన్ని రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామంలో ఆంజనేయ ఆలయ వీధిలో చింత చెట్టు కొమ్మ విరిగి 11 కెవి తీగలపై పడడంతో పంచాయతీలో 150 ఎల్ఇడి లైట్లు పాడైపోయాయని చెప్పారు. వీధిలైట్లు లేక పంచాయతీలో పలుచోట్ల అంధకారం అలుముకుంటుందని పంచాయతీ సెక్రటరీ తాతి విజయకుమారి తెలిపారు. పాడైపోయిన లైట్ల విలువ రూ.2 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి వీధిలైట్లు పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్ది ఒక్కరోజు ఆదాయం రూ.1,54,981

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి మంగళవారం ఒక్కరోజు ఆదాయం రూ.1,54,981 సమకూరిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. మంగళవారం పరిసర ప్రాంతాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించారు. ఈ క్రమంలో యాత్రికులకు మజ్జిగ పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు సిబ్బంది యాత్రికులకు తగిన సేవలు అందించారని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు.

18న ఆగిరిపల్లి మండల సమావేశం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీన ఎంపిపి గోళ్ల అనూష అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.వాణి తెలిపారను. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఘనంగా ఎంఎల్ఎ ఎలిజా దంపతుల వివాహ దినోత్సవం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా, జాన్సీ దంపతుల వివాహ దినోత్సవ వేడుక మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో వైసిపి యూత్ కమిటీ సభ్యులు కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్ఎ ఎలిజా, జాన్సీ దంపతులతో కేక్ కట్ చేయించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ప్రెసిడెంట్ పడమటి గిరిబాబుగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్స్ నేకురి కిషోర్, ఉగ్గాం ప్రసాద్, వైసిపి నాయకులు రాజా, మండల సోషల్ మీడియా కన్వీనర్ మనోజ్, లక్కవరం సచివాలయ కన్వీనర్ సూర్య పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ జయంతి వారోత్సవాలు

ప్రజాశక్తి - పోలవరం

ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం పోలవరం మండలంలో పలుచోట్ల ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరంలో స్థానిక సువర్చలా సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో, పోలవరం ప్రాజెక్టు కార్యాలయం అభయాం జనేయ స్వామి ఆలయంలో, గూటాల అభయాంజనేయ స్వామి ఆలయంలో, ప్రగడపల్లి ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో పోలవరం ప్రాజెక్టు అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.